నేడు మెగా ఉచిత వైద్యం, రక్తదాన శిబిరం

ఓల్డ్ బోయిన్‌పల్లి: మన్నె గణేష్ యాదవ్ జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరం, రక్తదానం శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు బోయిన్‌పల్లి వ్యవసాయ కూరగాయల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మన్నె ఉదయ్‌యాదవ్ తెలిపారు. సోమవారం డివిజన్‌లోని భాగ్యశ్రీ గార్డెన్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాఘవేంద్ర హాస్పిటల్, మిత్ర బ్లడ్ సెంటర్ సహకారంతో శిబిరం కొనసాగుతుందన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్నికల ప్రచారం

మూసాపేట: భరత్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల సందర్భంగా ఆదివారం సీనియర్ నాయకులు డాక్టర్ పట్లోళ్ల నాగిరెడ్డి ప్రచారం నిర్వహించారు. పులిగుర్తుపై పానల్ సభ్యులతో కలిసి పోటీ చేస్తున్నామని తెలిపారు. భరత్‌నగర్ కాలనీ కోసం 30 సంవత్సరాలుగా ఎంతో కృషి చేశానని, ఎన్నికలలో గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, వెంకటేష్‌యాదవ్, అప్పా బజార్ నరేష్, లక్ష్మీ నారాయణ, రాంబాబు, డేవిడ్, బుచ్చిబాబు, శ్రీనివాస్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి శరన్నవరాత్రోత్సవాలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి, సుమిత్రానగర్‌లోని కనకదుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలు ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి, ఆలయ సిబ్బంది ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం బాలత్రిపుర సుందరీ దేవిగా, మంగళవారం శ్రీకన్యాకుమారిగా, బుధవారం గాయత్రిదేవిగా, గురువారం శ్రీ సంతాన లక్ష్మీదేవిగా, శుక్రవారం ధనలక్ష్మీదేవిగా, శనివారం శ్రీ అన్నపూర్ణ దేవిగా, ఆదివారం లలితా దేవిగా, సోమవారం సరస్వతి దేవిగా, మంగళవారం దుర్గాదేవిగా, అక్టోబర్ 1న మహిషాసుర మర్దిని దేవిగా, 2న రాజరాజేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

'యాత్రదానం'లో భాగస్వాములవ్వాలి

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో 'యాత్రదానం'పేరిట ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని ప్రారంభించిందని, దీంట్లో అందరూ భాగస్వాములు కావాలని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్ వెంకటేష్ ఆదివారం సూచించారు. సమాజంలో ఔత్సాహికులు పలు రకాల దానాలు చేస్తూ ప్రజలకు సేవ చేయాలని ముందుకొస్తుంటారని ఆయన గుర్తుచేశారు. అదేవిధంగా యాత్రాదానంలో అనాథలకు, నిరాశ్రయులైన వృద్ధులకు, దివ్యాంగులు, పాఠశాల విద్యార్థులు, సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులు గురుకులాల్లో చదివే పేద విద్యార్థులకు విజ్ఞాన విహారయాత్రలు, పర్యాటక ప్రాంతాలు, పుణ్యక్షేత్రాలు సందర్శించడానికి వివిధ రకాల ప్యాకేజీలను ఉన్నతాధికారుల ఆదేశంపై ఆర్టీసీ హెచ్‌సీయూ డిపో అమలు చేస్తోందని వివరించారు. ఔత్సాహిక ప్రజా ప్రతినిధులు, ఎన్నారైలు, కార్పొరేట్ సంస్థలు, ఎన్జీఓలు, లయన్స్ క్లబ్, వివిధ రకాల స్వచ్ఛంద సేవా సంస్థలు ఈ యాత్రాదానం చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. యాత్ర దానం ప్యాకేజీలు, ఇతర వివరాలు తెలుసుకొనుటకు హెచ్‌సీయూ డిపో ఇన్‌చార్జి మేనేజర్: 99592 26132, ట్రాఫిక్ సూపరింటెండెంట్ లక్ష్మీభాయి: 9948082462లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆమెకు అందలం!

- 'రేవంతన్న కానుక'పేరిట చీరల పంపిణీ
- స్వయం సహాయక మహిళలకు మాత్రమే..
- గోదాంలకు చేరిన బతుకమ్మ చీరలు



సాక్షి,మేడ్చల్‌జిల్లా: మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం 'సద్దుల బతుకమ్మ'దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఆడబిడ్డలకు 'రేవంతన్న కానుక' పేరిట చేనేత చీరల పంపిణీకి శ్రీకారం చుడుతోంది. ఈనెల 21 నుంచి బతుకమ్మ పండుగ సంబురాలు ప్రారంభం కానుండటంతో ప్రభుత్వం ఒక్కో మహిళకు రెండు చీరల చొప్పున పంపిణీ చేయాలని నిర్ణయించింది. గత ప్రభుత్వం రేషన్‌కార్డులో సభ్యులైన ప్రతి మహిళకు ఒక చీర పంపిణీ చేయగా.. ప్రస్తుత ప్రభుత్వం స్వయం సహాయకసంఘాల్లోని సభ్యులందరికీ ఒక్కొక్కరికి రెండు చీరల చొప్పున పంపిణీ చేసేందుకు సన్నద్ధమవుతోంది.

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో సుమారు 3.50 లక్షల మంది లబ్ధి పొందనున్నారు. ప్రస్తుతం ఒక చీర మాత్రమే పంపిణీ చేయనున్నట్లు సంబంధిత జిల్లా స్థాయి అధికారులు పేర్కొంటున్నారు. అందుకనుగుణంగా ఇటీవల ప్రభుత్వం నుంచి చీరలు రాగా.. వాటిని అందుబాటులో ఉన్న శామీర్‌పేట, జవహర్‌నగర్, రామాంతాపూర్ గోదాముల్లో నిల్వ చేశామన్నారు. త్వరలోనే వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని అధికార వర్గాలు ప్రకటించాయి.

మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యం..

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయటమే ధ్యేయంగా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల ద్వారా చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటున్న స్వయం సహాయక సంఘాలకు ఉపాధి లక్ష్యంగా వడ్డీలేని రుణాలను అందజేస్తోంది. నగర శివారులోని 10 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 29,963 స్వయం సహాయక మహిళా సంఘాలకు అధికార యంత్రాంగం రూ.29.69 కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసింది.

- మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని 3,698 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.1.79 కోట్లు వడ్డీలేని రుణాలను అందజేసింది.

పట్టణాలు, బస్తీల్లోనూ ఉపాధి...

మేడ్చల్ జిల్లాలో మెప్మా ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న మున్సిపల్ సర్కిళ్లతో సహా పురపాలక సంఘాల్లో రూ.51 కోట్లతో ఇందిరా మహిళా శక్తి పథకం కింద పట్టణ మహిళలకు 7 రకాల చిన్నతరహా, కుటీర పరిశ్రమల ఏర్పాటుతో పాటు ఉపాధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

- నిర్మాణ రంగం, ఈవెంట్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ సర్వీస్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వ్యక్తిగతంగా కుటీర పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకు ద్వారా రుణసదుపాయం కల్పిస్తారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటునకు రూ.10 లక్షల రుణం అందజేయనుంది. దీనిలో 35 శాతం సబ్సిడీ లభించనుంది. పట్టణ మహిళలు చిన్నతరహా, కుటీర పరిశ్రమల స్థాపనకు రూ.3 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణం లభిస్తోంది.

రూ.50 వేల నుంచి రూ.10 లక్షలు..

మేడ్చల్ జిల్లాలో సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల అర్హతను బట్టి మహిళలకు వారి ఉపాధికల్పనకు రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు బ్యాంకు రుణాలు అందించేలా డీఆర్డీఏ చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ఐదు మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటయ్యాయి. మరో 10 క్యాంటీన్ల కోసం కసరత్తు చేస్తోంది.

- 250 కోళ్ల పరిశ్రమలు, 16 మీసేవా కేంద్రాలు, 18 కుట్టుమిషిన్ కేంద్రాలు, 1697 కుటీర పరిశ్రమల ఏర్పాటు కోసం డీఆర్డీఏ అధికార వర్గాలు చర్యలు తీసుకుంటున్నాయి. మహిళా సంఘాల సభ్యులతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టించే కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రభుత్వ జ్యోతిరావు పూలే స్కూల్ విద్యార్థులకు మహిళా సంఘాల సభ్యులతో దుస్తులు కుట్టించే చర్యలకూ పూనుకుంటోంది.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆరోగ్య భద్రత

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



చెక్కులను అందజేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆరోగ్య భద్రత కలుగుతుందని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో 47 మంది లబ్ధిదారులకు కార్పొరేటర్ నాగేందర్ యాదవ్‌తో కలిసి ఆదివారం లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు గొప్ప వరం అన్నారు. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని అన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, నాయినేని చంద్రకాంత్ రావు, మారబోయిన రాజు యాదవ్, కావూరి అనిల్, చిరుమర్తి రాజు, క్రాంతి, అల్లం మహేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



పీఏసీ చైర్మన్ గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న సగర సంఘం నాయకులు

ఆల్విన్‌కాలనీ: జగద్గిరిగుట్ట సగర సంఘం సభ్యులు పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పీఏసీ చైర్మన్ గాంధీని ఆదివారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. సగర సంఘం అభివృద్ధికి నిరంతరం శక్తి వంచనతో కృషి చేయాలని సూచించారు. సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు సంజీవరెడ్డి, నాయినేని చంద్రకాంతరావు, జగద్గిరిగుట్ట సగర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎరవెల్లి జగన్‌కి మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఎక్సలెన్సీ అవార్డు

బాలానగర్: జాతీయ ఇంజినీరింగ్ దినోత్సవం సందర్భంగా సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో సేవలు అందిస్తున్న జేఎన్‌టీయూ విద్యార్థి నేత ఎరవెల్లి జగన్‌కు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఎక్సలెన్సీ అవార్డు లభించింది. ఆదివారం ఆక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్ హైదరాబాద్‌లో నిర్వహించిన ఇంజినీరింగ్ డే దినోత్సవ వేడుకల్లో జగన్‌కు భారతరత్న, మొట్ట మొదటి భారతదేశం ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఎక్సలెన్స్ అవార్డు 2025 అందజేశారు. ఈ సందర్భంగా ఆక్ ఫౌండేషన్ చైర్మన్ మూర్తి మాట్లాడుతూ.. గత దశాబ్ద కాలంగా ఇంజినీరింగ్ విద్యార్థి నేతగా ఎరవెల్లి జగన్ డిప్లొమా స్టూడెంట్ ఫెడరేషన్, స్టూడెంట్ జేఏసీను స్థాపించి డిప్లొమా, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ డా. కమలాకర్, డా. శోభా, రామ్‌దేవ్‌రావ్ హాస్పిటల్ సీఈఓ డా. యోబు తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభోత్సవం చేయనున్నారు. పీఆర్‌నగర్‌లో నీటి సంపు ఏర్పాటు, ప్లంబింగ్ పనులు, యూపీహెచ్‌సీ దవాఖానాకు 10 లక్షల నిధులు, అవంతి నగర్ తోట కమ్యూనిటీ హాల్ షెడ్ ఏర్పాటు రూ.20 లక్షలతో, లేయింగ్ ఆఫ్ సీసీ రోడ్డు పలుచోట్ల కబీర్‌నగర్, బబ్బుగూడ పనులకు రూ.20 లక్షలు, కబీర్‌నగర్ కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు రూ.26 లక్షలు, లేయింగ్ ఆఫ్ సీసీ రోడ్డు, స్నేహపురి కాలనీ మోతీనగర్ చౌరస్తాలో రూ.20 లక్షలు, బీఎస్‌పీ కాలనీ పార్కులో జిమ్ పరికరాల ఏర్పాటు, టాయిలెట్స్ మరమ్మతుల పనులకు రూ.15 లక్షలతో పనులకు ప్రారంభం, ఉదయం 10.30 గంటలకు ఓల్డ్ బోయిన్‌పల్లి భాగ్యశ్రీ గార్డెన్‌లో ఉచిత వైద్య శిబిరం, రక్త దాన శిబిరం కార్యక్రమాల్లో పాల్గొనున్నట్లు తెలిపారు.



నూతన కమిటీ ఎన్నిక

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి చాప్టర్ సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి. రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడిగా వై. వేదమూర్తి, కార్యదర్శిగా జి.ఎస్. శర్మ, కోశాధికారిగా తిరుమలరావు, అసిస్టెంట్ కోశాధికారిగా శేషగిరిరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాఘవేంద్ర రావు, తొమ్మిది మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రతి ఆదివారం ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: అందరి సహకారంతో ప్రతి ఆదివారం ఉచిత వైద్య శిబిరం, న్యాయ సేవా కేంద్రం ద్వారా పలు సమస్యలు పరిష్కరిస్తున్నామని మోతీనగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిల్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ ఎస్.వి. ప్రసాద్ అన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్ మోతీనగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిల్ ఫోరం కార్యాలయం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమల బెడద తీవ్రంగా ఉందని, వాటిని అరికట్టాలని సంబంధిత అధికారులను త్వరలో కలిసి సమస్యను వివరిస్తామని తెలిపారు. ప్రతి నెలా తంబులా క్విజ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో బీజముల్ల నాగేశ్వరరావు, రాజు, శేషగిరి రావు, కొల్లప్ప తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

అడ్డంకులను అధిగమించి గమ్యం చేరాలి



చెక్కులు అందుకున్న విద్యార్థులతో అతిథులు

నిజాంపేట్: విజ్ఞానం ద్వారానే యువత ప్రగతిని సాధించి దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వాలని ప్రముఖ పారిశ్రామికవేత్త గర్నెపూడి కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీకామాక్షి బ్రాహ్మణ సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 42మంది విద్యార్థులకు 6 లక్షల రూపాయలు ఉపకారవేతనాలను చెక్కుల ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో అడ్డంకులను అధిగమించి పట్టుదలతో గమ్యం చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. వ్యాఖ్యాతగా డా.మారేపల్లి భువనేశ్వరి వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రముఖ సామాజిక వేత్త ఎల్లాప్రగడ లక్ష్మీ నర్సింహారావు, హైకోర్టు న్యాయవాది చక్రవర్తి, తోషిబా కంపెనీ జనరల్ మేనేజర్ రామకృష్ణ, ప్రముఖ వైద్యులు డా.చైతన్య, డా.సాయిచంద్ర, డా.బికెఎస్ సుధ, పారుపూడి పార్వతి, వైష్ణవి క్యాటర్స్ అధినేత ప్రసాద్ పాల్గొన్నారు.

దేవుని మాన్యంలో రాత్రికి రాత్రే సిమెంట్ రోడ్డు

తొలగించిన దేవాదాయ శాఖ అధికారులు

గచ్చిబౌలి: దేవుని మాన్యంలో రాత్రికి రాత్రే సిమెంట్ రోడ్డు వేశారు. దేవుని మాన్యం ఆక్రమణకు గురవుతుందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో దేవాదాయ శాఖ అధికారులు రోడ్డును పూర్తిగా తొలగించారు. గోపన్‌పల్లిలోని పురాతన రంగనాథ స్వామి ఆలయం మాన్యం సర్వే నెంబర్:268లో 13 ఎకరాల స్థలం ఉంది. దేవుని మాన్యంను ఆనుకొని సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ ఉంది. గెటెడ్ కమ్యూనిటీ నిర్మాణం చేపడుతున్న ఓ నిర్మాణ సంస్థ శనివారం రాత్రి సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టింది. దేవుని మాన్యం ఆక్రమించి సిమెంట్ రోడ్డును వేశారని గోపన్‌పల్లి వాసులు దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, ఈఓ సత్యచంద్రారెడ్డి అక్రమంగా వేసిన రోడ్డును పరిశీలించారు. డయల్ 100కు కాల్ ఫిర్యాదు చేశారు. ఆదివారం సిమెంట్ రోడ్డును తొలగించి గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ శివ కుమార్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రోడ్డు వేసిన వారిని గుర్తించాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పెద్ద చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పెద్ద తూము వద్ద 45–50 ఏళ్లున్న వ్యక్తి మృతదేహం నీటిపై తేలుతూ.. కనబడటంతో స్థానికులు డయల్ 100కు సమాచారం అందించారు. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

కుత్బుల్లాపూర్: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని బీజేపీ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల పైపులైన్ రోడ్డు శ్రీరామ్ కాలనీ మీదుగా సుచిత్ర లింక్ రోడ్డు పనులకు రూ.3 కోట్ల నిధులు మంజూరైన నేపథ్యంలో ఆదివారం ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన పర్యటించారు. లింక్ రోడ్డు పనులు పూర్తయితే ట్రాఫిక్ జామ్ తగ్గుముఖం పడుతుందని, జీడిమెట్ల పైపులైన్ రోడ్డు నుంచి సుచిత్ర చౌరస్తాకు చేరుకోవడం సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో పాపయ్య దొర, సతీష్ చంద్ర, నిఖిల్ రాజు, వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, రవీందర్, సాయి కిరణ్, వెంకట్‌గౌడ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న బీజేపీ నేత భరతసింహారెడ్డి

రెచ్చిపోతున్న పెట్రోల్ దొంగలు !

పార్కింగ్ చేసిన వాహనాల నుంచి పెట్రోల్ చోరీ | కనిపించని పోలీసుల పెట్రోలింగ్

బైక్ దొంగలు, కారు దొంగలు, నగలు, నగదు దోచుకునే దొంగలను చూసి ఉంటాం. కానీ పెట్రోల్ దొంగలు అని చూడటం తక్కువ. కానీ మూసాపేట పరిసర ప్రాంతాల్లో పెట్రోల్ దొంగలు అంటేనే స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పెట్రోల్ దోచుకువెళ్లడమే కాక వాహనాలను ధ్వంసం చేసి వెళ్తున్నారు. వాహనాలను, పెట్రోల్‌ను కాపాడుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు, పోలీసులు పెట్రోలింగ్ సరిగ్గా చేయకపోవడంతోనే పెట్రోల్ దొంగలు పేట్రేగిపోతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూసాపేట: మూసాపేట పరిసర ప్రాంతాల్లో అర్ధరాత్రి వాహనాల నుంచి పెట్రోల్‌ను అపహరిస్తున్నారు. ముగ్గురు కలిసి రోడ్లపై పార్కింగ్ చేసి ఉన్న వాహనాలను టార్గెట్ చేసుకుని ఒక్కరు వాహనం వద్ద బాటిల్‌లో పెట్రోల్ నింపుతుండగా, మరొకరు అదే వీధిలో చివరన వాహనంపై కూర్చొని ఉంటాడు. మరొకరు రోడ్డుపై తిరుగుతూ ఏదైనా అలికిడి వచ్చిన వెంటనే సిగ్నల్స్ ఇచ్చి పరార్ అవుతున్నారు. మూసాపేట, భరత్‌నగర్, భవానీ నగర్, ప్రగతి నగర్, జనరతా నగర్, యాదవబస్తీ, ఇలా పరిసర ప్రాంతాల్లో ప్రతి చోట వాహనాల నుంచి పెట్రోల్‌ను దొంగతనం చేస్తున్నారు. ఆ పెట్రోల్‌ను విక్రయించి చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారు. టీనేజ్ పిల్లలే దొంగతనం చేస్తూ కనిపించారని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు.



అత్యవసరంగా వెళ్లాలంటే ఇబ్బందులే..

నిత్యం ఉదయం పనులకు వెళ్లి సాయంత్రం, రాత్రి వచ్చి వాహనాలను పార్కింగ్ చేసి ఆదా మరిచి పడుకుంటున్నారు. మళ్లీ ఉదయం లేచి చూసే సరికి బైక్‌లో పెట్రోల్ ఉండటం లేదు. డెలివరీ బాయ్స్‌గా, దూర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు పెట్రోల్ ఎక్కువ పోయించుకోవాలన్నా ఇబ్బంది పడుతున్నారు. దొంగలు పెట్రోల్ పోవడమే కాక వాహనాలను ధ్వంసం చేయడంతో అనేక ఇబ్బందుల పడుతున్నారు. అత్యవసరంగా రాత్రి సమయంలో కుటుంబంలో ఎవరికైనా ఆపద వచ్చి ఆసుపత్రికి వెళ్లాలంటే బైక్ స్టార్ట్ కాదు. ఆ సమయంలో ఎవరికి అడిగి బైక్‌ను తీసుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం పిల్లల్ని స్కూల్‌లో దించాలన్నా, ఆఫీస్‌కు వెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నారు.

కనిపించని పోలీసుల పెట్రోలింగ్

పోలీసులు రాత్రి సమయంలో ప్రధాన రహదారిలో పెట్రోలింగ్ చేసి వెళ్లి పోవడంతో కాలనీ వీధుల్లోకి ఎవరు రారు అన్న ధీమాతో పెట్రోల్ దొంగలు పెరిగిపోతున్నారు. కాలనీలోని వీధుల్లో కూడా అర్ధరాత్రి తరువాత పెట్రోలింగ్ చేయాలని స్థానికులు పోలీసులను వేడుకుంటున్నారు.

సీసీ కెమెరాలేవి?

భవన యజమానులది కూడా తప్పే. కిరాయిలకు ఆశపడి భవనంలో కనీసం పార్కింగ్ కూడా స్థలాన్ని చూపించకుండా 60 గజాల్లో 6 ఫ్లోర్‌లో వేసి, సింగిల్ రూమ్, డబుల్ రూమ్ అంటూ ఒక్కో భవనంలో 18 కుటుంబాలను ఉంటున్నారు. మధ్య తరగతి కుటుంబం, ఏ చిన్న ఉద్యోగం చేసిన బైక్ ఉండాల్సిందే. దీంతో 18 బైక్‌లు రోడ్డుపై ఉండాల్సిందే. రాత్రి సమయంలో మూసాపేట పరిసర ప్రాంతాల్లో ఏ రోడ్డు చూసినా ద్విచక్ర వాహనాలు, కార్లే కనిపిస్తాయి. ఏ ఒక్క భవనానికి కూడా సీసీ కెమెరా కూడా ఉండదు. పోలీసులు పెట్రోలింగ్‌ను పెంచడమే కాక భవనం ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా మిలాద్‌–ఉన్‌–నబీ ర్యాలీలు



ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: మిలాద్‌–ఉన్‌–నబీ పర్వదిన వేడుకలను ఓల్డ్ బోయిన్‌పల్లిలోని వివిధ ప్రాంతాల్లో ముస్లింలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ర్యాలీలు నిర్వహించారు. హస్మత్‌పేట చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో వేడుక ప్రాధాన్యతను పెద్దలు వివరించారు. ఎమ్మెల్యే కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ నర్సింగ్‌రావు, డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్ పాల్గొని పేట్‌గల్లీ, బడే మసీద్, స్టార్ పాయింట్ హోటల్, ఫరీద్‌నగర్ మసీద్‌లకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఓల్డ్ బోయిన్‌పల్లి, హస్మత్‌పేట, పేట్ గల్లీ, ముస్లిం బస్తీ, అంజయ్యనగర్ ప్రాంతాల్లో వేలాది మంది పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు స్వీట్స్ పంచిపెట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మేకల హరినాథ్, నాయకులు బుర్రి యాదగిరి, నజీర్, సలీం, అజీమ్, ఖాజా పాల్గొన్నారు.

మోతీనగర్: మిలాద్ ఉన్ నబి సందర్భంగా అల్లాపూర్ డివిజన్‌లోని పలు ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. ర్యాలీలో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మహ్మద్ గౌసుద్దీన్ తదితరులు



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు